# గణపతి

నేను చదువుకునే రోజుల్లో కలిగిన అభిరుచి వల్లనో, చేస్తున్న ఉద్యోగంలో వాడవలసి రావటం వల్లనో, ఎప్పటినించో నాకు స్టాటిస్టిక్స్ సబ్జక్ట్ అంటే ఇష్టంగానూ సరదాగానూ వుండేది. ఇంకావుంది కూడా. ఇటు స్టాటిస్టికల్ ప్రాసెస్ కంట్రోల్ లాటివే కాకుండా, ప్రపంచంలో అన్నిరకాల స్టాటిస్టిక్సూ సరదాగా చదవటంవల్ల ప్రపంచ పోకడలు ఎలా వున్నాయో తెలిసే అవకాశాలు వున్నాయి. వాటిలో కొన్ని సరదాగా వుండేవీ, చక్కటి సమాచారం ఇచ్చేవీ చూద్దాం ఈసారి.

స్టాటిస్టిక్స్‌ని తెలుగులో గణాంకశాస్త్రం అంటారు. గణాంకాలంటే సెన్సస్ అనికూడా అర్థంవుంది. బహుశా అది కూడా స్టాటిస్టిక్స్‌లో భాగమే కనుక అలా అంటారేమో, తెలిసినవారే చెప్పాలి. మనం తెలుగు వాళ్ళం కనుక ఇంగ్లీషులోనూ, తెలుగంటే ప్రేమ కనుక సాధ్యమైనంత వరకూ తెలుగులోనూ ఈ పదాలు వాడదాం.

గణాంక శాస్త్రంలో నిపుణుడిని ముద్దుగా గణపతి అని పిలుస్తాను నేను. అంతేకానీ ఈ వ్యాసం వినాయకుడికి సంబంధించినది కాదు.

ఇంగ్లీషులో స్టాటిస్టీషియన్ అనే వాడికి ఒక సరదా నిర్వచనం వుంది. ఒకతని కాళ్ళు ఫ్రీజర్‌లోనూ, తల ఒక కుంపటిలోనూ పెడితే సగటున అతని శరీర ఉష్ణోగ్రత నార్మల్‌గా ఉంటుంది అంటాడుట స్టాటిస్టీషియన్. ఇది హాస్యంగా చెప్పుకునేది కనుక అందరు గణపతులు అలా వుంటారనుకోకండి. ఇంకొక విషయం. ఈ గణాంక శాస్త్రంలో ప్రపంచంలో ఏ దేశంలో చూసినా ఎక్కువగా, ప్రముఖంగా కనపడేది మన భారతీయులే. అది మనకి నిజంగా గర్వ కారణం.

ముందుగా ప్రపంచ జనాభా ఎలా వుందో చూద్దాం. 1804లో ఒక బిలియన్ అంటే వంద కోట్లు. 1999లో ఆరు బిలియన్లు. అంటే 600 కోట్లు. 1804లో ప్రపంచ జనాభా ఎంతవుందో ఇప్పుడు మన భారతదేశ జనాభా అంతకన్నా ఎక్కువ అన్నమాట. చైనా 129 కోట్ల ఎనభై తొమ్మిది లక్షల జనాభాతో మొదటి స్థానంలో వుంది. భారతదేశం నూట ఆరు కోట్ల యాభై ఒక్క లక్షలమందితో రెండవ స్థానంలో వుంది. అమెరికా ఇరవై తొమ్మిది కోట్ల జనాభాతో మూడవ స్థానంలో వుంది. ఇక్కడ గమ్మతేమిటంటే చైనా ఇండియా రెండు దేశాల జనాభా కలిపితే, ప్రపంచ జనాభాలో మూడొంతుల పైనే వుంది. ప్రపంచంలోని అన్ని దేశాల కన్నా తక్కువ జనాభా వున్న దేశం వాటికన్. అక్కడ 911 మందే వున్నారుట. అక్కటా! తువలు అనే దేశంలో 11 వేల మందీ, నారు అనే దేశంలో 12 వేల మందీ వున్నారుట. నారు పోసిన వాడే నీరు పోస్తాడు మరి!

జనాభా సంగతి సరేసరి. మరి దేశాల వైశాల్యాలెలా వున్నాయి? చూద్దాం. ప్రపంచంలో అన్నిటికన్నా పెద్ద దేశం రష్యా. నూట డెభై లక్షల చదరపు కిలోమీటర్లు. దాని తరవాత కెనడా 99.8 లక్షలు, అమెరికా 96 లక్షలు, నాలుగవ స్థానంలో చైనా

95.96 లక్షలు, ఐదవ స్థానంలో బ్రెజిల్ 85 లక్షల చదరపు కిలోమీటర్లు. ఇండియా 32.87 లక్షల చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో ఏడవ స్థానంలో వుంది. అన్నిటికన్నా చిన్న దేశం వాటికన్ వైశాల్యం అర చదరపు కిలోమీటర్ మాత్రమే! దానికన్నా పెద్దది 21 చ.కి.మీ.ల నారు. నేను చూసిన నాలుగైదు చోట్లా ఈ నెంబర్లలో కొంచెం తేడాలు వున్నాయి కానీ, వరుసక్రమం ఒకేలా వుంది. అందుకని ఎక్కడన్నా తేడాలు వస్తే మాత్రం నన్ను ఆడిపోసుకోకండి.

ఇక ప్రపంచంలోని పట్టణాలని తీసుకుంటే, అన్నిటికన్నా ఎక్కువ జనాభా వున్నది 133 లక్షల జనాభాతో చైనాలో షాంగ్‌హాయ్. ఇక్కడ సిటీ అంటే సిటీ మాత్రమేననీ, చుట్టుపక్కల వూళ్ళు కలపలేదనీ ఒక చిన్న వాక్యంకూడా వుంది నేను చూస్తున్న చోట. రెండవది 126 లక్షలతో ముంబై, మూడవది 120 లక్షలతో అర్జెంటీనాలో బ్యూనొస్సైరెస్. అలా కాకుండా ఊరి పొలిమేరలకి చుట్టుపక్కల వూళ్ళని కూడా కలుపుకుంటే, టోక్యో 312 లక్షలతో మొదటి స్థానంలో, న్యూయార్క్- ఫిలడెల్ఫియా 310 లక్షలతో రెండవ స్థానంలో, మెక్సికో సిటీ 215 లక్షలతో మూడవ స్థానంలో వున్నాయి. మన దేశం నించీ 173.67 లక్షలతో ఢిల్లీ ఎనిమిదవ స్థానంలో వుంటే, 173.41 లక్షల జనాభాతో ముంబై వుంది.

మన దేశంలో జనాభా చూస్తే ముంబై ఢిల్లీ కలకత్తా మద్రాస్ బెంగుళూర్ అహమ్మదా బాద్ హైద్రాబాద్ సిటీలు వరుసగా వున్నాయి. ఇక్కడకూడా సిటీ జనాభా మాత్రమే లెఖ్ఖల్లోకి తీసుకున్నారు.

ఇక మతాలు చూస్తే 1994 లెఖ్ఖల ప్రకారం ప్రపంచంలో కెల్లా పెద్ద మతం 34 శాతం పాటించే క్రిష్టియానిటీ. రెండవది 18.3 శాతంతో ఇస్లాం. మూడవది 13.5 శాతంతో హిందువులు. ఇరవై శాతం పైన ఏ మతం మీదా నమ్మకం లేనివాళ్ళూ, అసలు దేవుడినే నమ్మనివాళ్ళూ వున్నారు.

ప్రపంచంలోకెల్లా ధనవంతులు ఎక్కడ వున్నారో తెలుసా? అమెరికాలో 269 మంది బిలియనీర్లు, జపాన్‌లో 29 మంది, జర్మనీలో 28 మంది బిలియనీర్లు వున్నారు. నల్లడబ్బు లెఖ్ఖ వేసినట్టు లేదు. మన రాజకీయ నాయకులూ, సినిమా తారలూ ఈ లిస్టులో లేరు మరి!

ఎక్కువ ధనవంతమైన దేశాల్లో మొదటి మూడూ లక్సంబర్గ్, అమెరికా, బెర్మ్యూడా. అతి బీద దేశాల్లో మొదటి మూడు స్థానాల్లో సియారా లియోన్, టాంజేనియా, ఇథియోపియా వున్నాయి. నిరుద్యోగుల్లో మొట్టమొదట లైబీరియా వుంది. అక్కడ నూటికి డెభైమందికి ఉద్యోగాలు లేవు. తరువాత కెన్యా, జాంబియా, జింబాబ్వే యాభై శాతంతో వున్నాయి.

మన హిందూ మహా సముద్రంలో వున్న మాల్‌దీవ్స్‌లో పెళ్ళయిన ప్రతి వేయిమందిలో 11మంది ఏటేటా విడాకులు తీసుకుంటూ ప్రథమ స్థానంలో వున్నారు. 4.63మందితో బెలరూస్ రెండవ స్థానంలోనూ, 4.3మందితో అమెరికా మూడవ స్థానంలోనూ వున్నాయి. అయితే ఆత్మహత్యల్లో ప్రతి వేయిమందికీ లిథుయేనియాలో 42మంది, రష్యాలో 37మంది, బెలరూస్‌లో 35మందీ మొదటి

మూడు స్థానాల్లో వున్నారు. బెలరూస్‌లో విడాకులు తీసుకుంటున్నారుకదా, మళ్ళీ ఆత్మహత్యలెందుకో?

అయితే అండోరాలో సగటు జీవితకాలం 84 ఏళ్ళు, మాకా దీవుల్లో 81.7, శాన్ మరీనోలో 81.23 ఏళ్ళు. దీర్ఘాయుష్మాన్ భవ!

మరీ శుభ్రంగా వుండే దేశాలేమిటో తెలుసా? ఫిన్‌లాండ్ నార్వే కెనడా అదే వరుసలో మొదటి మూడు స్థానాల్లో వున్నాయి.

మరి విజ్ఞాన రంగంలో? అమెరికా 270 నోబుల్ ప్రైజ్ విజేతలతో ప్రధమ స్థానంలో వుంటే, యు.కె. 101, జర్మనీ 76 మందితో తరువాతి స్థానాల్లో వున్నాయి.

అన్ని దేశాలలో కంటే ఎక్కువ కంప్యూటర్లు వున్న దేశం 164 లక్షలతో అమెరికా. తరువాత 49 లక్షలతో జపాన్, తర్వాత జర్మనీ, చైనా. మరి ఎక్కువగా ఇంటర్నెట్ వాడే దేశాలు? అమెరికాలో 148 మిలియన్లమంది వాడుతుంటే జపాన్‌లో 27 మిలియన్‌లూ చైనాలో 22 మిలియన్‌లూ వాడుతున్నారుట. మొబైల్ ఫోన్ల వాడకంలో ఈ మూడు దేశాలూ వెనకపడ్డాయి. ఫిన్‌లాండ్‌లో 68 శాతం జనాభా, నార్వేలో 63 శాతం, స్వీడెన్‌లో 59 శాతం జనాభా వాడుతున్నారుట. ప్రపంచం మొత్తంలోనూ ఎక్కువ ఎలెక్ట్రిసిటీ వాడే దేశాలు ఐస్‌లాండ్, నార్వే, ఫిన్‌లాండ్ వాళ్ళు మనకి కొన్ని మెగా వాట్లు ఇస్తే మనకి పవర్ కట్ల వాట్లు, పాట్లు వుండవు కదా!

మన ఇండియా మొట్ట మొదటి పది స్థానాల్లో వున్నది ఇంకొకటుంది. 'ఓ ఫైవ్ వుంటే ఇవ్వండి సార్! మళ్ళీ ఇచ్చేస్తాను' అంటాడే ఆ అప్పారావుకి తెలుసు దేంట్లోనో. బ్రెజిల్, రష్యా, మెక్సికోల తరవాత మనమే వున్నాం అప్పులలలో తల నిండా మునిగి.

కాకపోతే రెండు కొస మెరుపులు. మనం ప్రధమ స్థానల్లో వున్నవి. మన దేశంలో 8407 యూనివర్సిటీలు వున్నాయిట. మన తర్వాత రెండవ స్థానంలో అమెరికా 5758 యూనివర్సిటీలతోనూ, మూడవ స్థానంలో అర్జెంటీనా 1705 యూనివర్సిటీలతోనూ వున్నాయి.

ప్రపంచంలో కల్లా అందమైన అమ్మాయిలు ఎక్కడ వున్నారు? ఇంద్రలోకంలో అంటాయి మన పురాణాలు. ఆ ఇంద్రలోకం పేరు ఈ రోజుల్లో ఇండియా. మిస్ వరల్డ్ పోటీల్లో ఎక్కువగా ఎన్నికయిన సుందరాంగులు ఏ దేశాలకి చెందినవారో ఆ దేశాలని ఈ లిస్ట్‌లో పెట్టారు. ఇండియా 5 ప్రపంచ సుందరులతో మొదటి స్థానంలోవుంది. మనతో పాటే వెనిజువేలా కూడా 5 సుందరాంగులతో ప్రధమ స్థానంలో వుంది. తరువాత యునైటెడ్ కింగ్‌డం నలుగురితో మూడవ స్థానంలో వుంది.

'సుందరీ! ఓహో సుందరీ! నీవంటి దివ్య స్వరూపము ఎందెందు వెతికిన లేదు కదా!' అని ఏనాడో ఊరికే అన్నాడా రేలంగి!

0 0 0